> **ఆడామగా అన్న తేడా లేదు. మా అందరి చేతులకు బేడీలు వేశారు. కాళ్లకు సంకెళ్లు కట్టారు. 40 గంటల పాటు అలాగే కదలకుండా కూర్చున్నాం. లేచి నిలబడటానికి మమ్మల్ని అనుమతించలేదు. తిండి తినాలన్నా అంతే. బాత్రూంకి వెళ్లాలంటే.. అమెరికన్ సిబ్బంది కాపలాగా వచ్చారు. చేతికి ఒక వైపు బేడీలను మాత్రమే తొలగించారు. మాతో మానవత్వం లేకుండా వ్యవహరించారు. మమ్మల్ని నేరస్థులుగా చూశారు. అమెరికా నుంచి ఓ మిలటరీ వాహనంలో తీసుకొచ్చి భారత గడ్డమీద విడిచిపెట్టారు. ఇదంతా చూసిన వాళ్లు ఇంకెప్పుడూ ఈ డంకీ రూట్‌లో ప్రయాణించరు.**
>
> **- అమెరికా బహిష్కరణకు గురై భారత్ తిరిగివచ్చిన బాధితుడు గుర్‌ప్రీత్ సింగ్ వ్యాఖ్యలు**

అమెరికా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందికి అవకాశాల స్వర్గం. ఆశల సౌధం, కలలకు గమ్యస్థానం. అందుకే ఆ దేశానికి ఎన్నో దేశాల నుంచి ప్రతి ఏటా లక్షలాది మంది వలస వెళ్తుంటారు. వీటిలో అన్ని పత్రాలతో కూడిన సక్రమ వలసలు కొన్నైతే, మరికొన్ని అక్రమమైనవి. ఇలా అమెరికాలో అడ్డదారుల్లో అడుగుపెట్టాలని అనుకునేవారు ఎక్కువమంది అగ్రరాజ్యం దక్షిణ సరిహద్దు దేశం మెక్సికో మీదుగా వెళ్తారు. ఇది అత్యంత ప్రమాదభరితమైన ప్రయాణం. గడ్డ కట్టించే చలి, దుర్గమమైన అడవులు, సుళ్లు తిరిగే జల ప్రవాహాలు, సుదీర్ఘమైన ఎడారుల గుండా సాగుతుంది. విషసర్పాలు ఒకవైపు.. ధన, మాన, ప్రాణాలను దోచుకునే మానవ మృగాలు మరోవైపు తటస్థపడతాయి. వీటన్నిటినీ దాటుకుని అమెరికా గమ్యాన్ని చేరటం అంత తేలిక కాదు.

ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలు, బయటి వ్యక్తులు దాడిచేయటం మొదలైన కారణాల వల్ల చాలామంది మధ్యలోనే ప్రాణాలు కోల్పోతారు. మరికొంతమంది గాయాల బారినపడి అత్యంత దయనీయ పరిస్థితుల్లో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తారు. కానీ ఇవేవీ బయటి ప్రపంచానికి తెలియవు. ఈ ప్రయాణం వివిధ దశలలో సాగుతుంది. భారతీయ పౌరులు ముందుగా చట్టపరమైన వీసాలతో ఈక్వెడార్, కొలంబియా, పెరు లాంటి లాటిన్ అమెరికా దేశాలకు ప్రయాణించాలి. అక్కడి నుంచి స్మగ్లర్లు, ఇతరుల సాయంతో మరికొంత దూరం ముందుకు వెళ్లవలసి ఉంటుంది. అప్పుడుగానీ మెక్సికో-అమెరికా సరిహద్దుకు చేరలేరు.

అందుకే బ్రోకర్లు వీసా సమస్యలు అంతగా లేని బ్రెజిల్, ఈక్వెడార్, బొలీవియా, గయానా వంటి దేశాలకు, సెంట్రల్ అమెరికాలోని కోస్టారికా, నికారాగువా,



హోండురాస్, గ్వాటెమాల, మెక్సికో దేశాలకు ప్రయాణికులను చేరవేస్తున్నారు. కొన్నిసార్లు దుబాయ్ నుంచి మెక్సికోకు నేరుగా వీసా ఇప్పిస్తారు. ఇది వలసదారులు చెల్లించే ధరలను బట్టి ఉంటుంది. అక్కడినుంచి డంకీ రూట్‌లో మెక్సికో మీదుగా ప్రయాణం చేయాలి.

### ఆద్యంతం ప్రమాదభరితం

డంకీ రూట్.. దీన్నే డేరియన్ గ్యాప్ అని పిలుస్తారు. దక్షిణ అమెరికా నుంచి ఉత్తర అమెరికా వరకూ విస్తరించి ఉండే దాదాపు 100 కిలోమీటర్ల నిడివి కలిగిన మార్గం. దట్టమైన భూమధ్య రేఖాప్రాంతపు వర్షారణ్యాలు, నిటారుగా ఉండే పర్వతాలు, చిత్తడినేలలతో కూడిన ఈ ప్రాంతం అక్రమ కార్యకలాపాలకు, స్మగ్లింగ్‌కు కేంద్రం. ఇది దాటితే కనిపించేవి పనామా అడవులు. వీటిమీదుగా వెళ్లేటప్పుడు ప్రయాణికులకు కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు లాంటి ప్రకృతి వైపరీత్యాలు ఎదురవుతాయి. అంతేకాదు, పులి మీద పుట్రలా వన్యప్రాణుల ముప్పు కూడా పొంచి ఉంటుంది.

మూడోది కొలంబియన్ సరిహద్దు.. ఇక్కడి ప్రయాణంలో సాయుధ గెరిల్లా దళాలు, అవినీతి అధికారులు తటస్థపడతారు. వలసదారులు కొలంబియా నుంచి పనామా దేశపు రాజధాని పనామా సిటీకి చేరడానికి ముందుగా వంద కిలోమీటర్లకు పైగా ట్రెక్కింగ్ చేయాలి. గతేడాది దాదాపు 2,50,000 మంది డేరియన్ గ్యాప్‌ను దాటుకుని ముందుకు వెళ్లారు. ఇది కొలంబియా-పనామా సరిహద్దుల్లో ఉంటుంది. అక్కడినుంచి రోజుల తరబడి నడుచుకుంటూ ముందుకు సాగితే గానీ వలసదారుల రిసెప్షన్ కేంద్రానికి చేరుకోవటం సాధ్యం కాదు. అక్కడినుంచి కూరగాయల లారీల్లో పనామా సిటీకి తరలిస్తారు. ఆ తర్వాత బస్సు ద్వారా కోస్టారికా, నికారాగువా, హోండురాస్, గ్వాటెమాల దేశాల మీదుగా ప్రయాణించి, చివరికి మెక్సికో– అమెరికా దేశాల సరిహద్దులకు చేరుకుంటారు. ఇక్కడే చాలామంది అమెరికా సరిహద్దు నిఘా సిబ్బందికి చిక్కుతారు.

